# రజకుల మద్దతు బీఆర్ఎస్‌కే



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు, రజక సంఘాల సమితి నాయకులు

- కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి
- రజక సంఘాల సమితి రాష్ట్ర చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడతో కలిసి ప్రగతి కరపత్రం ఆవిష్కరణ

వేములవాడ, నవంబర్ 1: కేసీఆర్ హయాంలోనే రజక సామాజికవర్గ అభివృద్ధి జరిగిందని.. రాబోయే ఎన్నికల్లో మా సంపూర్ణ మద్దతు బీఆర్ఎస్ పార్టీకే ఉంటుందని రజక సంఘాల సమితి రాష్ట్ర చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ రూపొందించిన కరపత్రాన్ని బుధవారం పట్టణంలోని చల్మెడ నివాసంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుతో కలిసి వారు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, వీరవనిత చిట్యాల ఐలమ్మ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయమన్నారు. 250యూనిట్ల వరకు లాండ్రీ షాపులకు 80వేల ఉచిత కరెంట్ కనెక్షన్లు మంజూరు చేసిందని గుర్తు చేశారు. రాష్ట్రంలోని 141 మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లో సైతం దోబీఘాట్‌లను మంజూరు చేశారని, కొన్ని చోట్ల నిర్మాణంలో ఉన్నాయని చెప్పారు. కుల సంఘాలకు పలు భవనాలు కూడా నిర్మించారన్నారు. హైదరాబాద్‌లో రెండెకరాల స్థలాన్ని కూడా సంఘానికి కేటాయించడం సంతోషకరమన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు అమలు చేసినందున ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులకు తమ మద్దతు తెలియజేస్తున్నామని తెలిపారు. వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు కూడా తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రజక సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగంపల్లి దేవయ్య మడేల్, వర్కింగ్ ప్రెసిడెంట్ మైలారం రామ్, ఏఎంసీ మాజీ చైర్మన్ గడ్డం హన్మాండ్లు, మండలాల అధ్యక్షులు సుద్దాల నర్సయ్య, మొగిలి అంజయ్య, లింగంపల్లి గంగాధర్, నేరెళ్ల బాలయ్య, యూత్ ప్రధాన కార్యదర్శి రాగళ్ల కర్నాకర్, జిల్లా కార్యదర్శి బాలయ్య, సంఘం నాయకులు నవీన్, శివ, రామ్, విజయ్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## బీఆర్ఎస్‌లోకి దమ్మన్నపేట బీజేపీ నేతలు



బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న కొండూరి రవీందర్‌రావు

గంభీరావుపేట, నవంబర్ 1: మండలంలోని దమ్మన్నపేటకు చెందిన బీజేపీ సీనియర్ నేతలు బుధవారం నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. గ్రామానికి చెందిన బీజేపీ నేతలు పోచంపల్లి రాజు, మోహన్‌రావులకు బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి వారిని కొండూరి ఆహ్వానించారు. ఏఎంసీ చైర్మన్ కొత్తింటి హన్మంతరెడ్డి, గ్రామాధ్యక్షుడు కొలనూరి వేణు, నేతలు సంజీవ్, శేఖర్‌గౌడ్ ఉన్నారు.

## చొప్పదండిలో గులాబీజెండా ఎగురడం ఖాయం



కొత్తపేటలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బోయినపల్లి, నవంబర్ 1: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి నియోజక వర్గంలో గులాబి జెండా ఎగురడం ఖాయమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జోగినపల్లి ప్రేమ్‌సాగర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. బుధవారం బోయినపల్లి మండలం మల్లాపూర్, కొత్తపేట, మర్లపేట గ్రామాల్లో బీఆర్ఎస్ చొప్పదండి నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ పాలనను ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా నాయకుడు చెన్నాడి అమిత్‌కుమార్, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, రైతు బంధు సమితి కన్వీనర్ కొనుకటి లచ్చిరెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, ఏఎంసీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ కొనుకటి నాగయ్య, మాజీ ఎంపీపీ సత్తినేని మాధవ్, కొండగట్టు ఆలయ కమిటీ సభ్యులు బెంద్ర మాధవరెడ్డి, ముద్దం రవి, సింగిల్ విండో చైర్మన్ వేసిరెడ్డి దుర్గారెడ్డి, సర్పంచులు ఇల్లందుల శంకర్, బూర్గుల నందయ్య, ఒంటెల గోపాల్‌రెడ్డి, చిందం రమేశ్, కస్తం మధు, బీఆర్ఎస్ నాయకులు ఐరెడ్డి మల్లారెడ్డి, ఈడ్గు స్వామి, సంబ లక్ష్మీరాజం, గుంటి శంకర్, జంపుక ఆనంద్, నిమ్మ శ్రీనివాసరెడ్డి, జూలపల్లి అంజన్‌రావు, ఆరెపల్లి రాజు పాల్గొన్నారు.

## మంత్రి కేటీఆర్‌కు లక్ష మెజార్టీ తేవాలే



మాట్లాడుతున్న సెస్ చైర్మన్ చిక్కాల రామారావు

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 1: అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి కేటీఆర్‌కు లక్షకుపైగా మెజార్టీ తేవాలని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు సూచించారు. బుధవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ నేతలతో మాట్లాడారు. తంగళ్లపల్లి మండలానికి మొదటి నుంచి మంత్రి కేటీఆర్ సముచిత స్థానం కల్పించారన్నారు. మున్సిపల్‌లో విలీనం చేస్తామంటే మంత్రి కేటీఆర్‌ను ఒప్పించి నిలిపివేశామన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు మంత్రికేటీఆర్‌కు భారీ మెజార్టీ అందించేలా పని చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, ఎంపీపీ పడిగెల మానస, ఏఎంసీ చైర్ పర్సన్ పూసపల్లి సరస్వతి, ఎంపీటీసీ కోడి అంతయ్య, ప్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు బండి జగన్, పడిగెల రాజు, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నేత జక్కుల నాగరాజుయాదవ్, సద్ది రోజా, కోడం సంధ్యారాణి, క్యారం జగత్‌కుమార్, నేరెళ్ల అనిల్‌గౌడ్, దుర్గయ్య, సాహెదా బేగం, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

### తంగళ్లపల్లి మండలంలో జోరుగా ప్రచారం

తంగళ్లపల్లి, అంకుసాపూర్, జిల్లెల్ల, నేరెళ్ల, సారంపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ నేతలు గడపగడపకూ వెళ్లి ప్రచారం చేశారు. నేరెళ్లలో బీఆర్ఎస్ ఎన్నికల కార్యాలయాన్ని ఏఎంసీ చైర్ పర్సన్ పూసపల్లి సరస్వతి, నేతలు ప్రారంభించారు. సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాట్ల మధు, సర్పంచ్ బొబ్బల మంజుల, ఎంపీటీసీ మీసాల కళ, పుర్మాణి రాంలింగారెడ్డి, మాజీ సింగిల్‌విండో చైర్మన్ పబ్బతి విజయేందర్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ తాండ్ర రవీందర్‌రావు, మల్లేశం, మీసాల కృష్ణ, గోపాల్ ఉన్నారు. దివ్యాంగుల సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు దొంతినేని చంద్రరావు నేరెళ్లలో ప్రచారం చేశారు.



తంగళ్లపల్లిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న ఎంపీపీ మానస, మండలాధ్యక్షుడు రాజన్న, నేతలు

# ఎన్నికలు సజావుగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, చిత్రంలో ఎస్పీ అఖిల్ మహాజన్

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- ఎన్నికల నియమనిబంధనలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

కలెక్టరేట్, నవంబర్ 1: జిల్లాలో ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. బుధవారం ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి కలెక్టరేట్ మీటింగ్ హాలులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నామినేషన్ల ప్రక్రియ, ఎన్నికల నిర్వహణ, ఎన్నికల కమిషన్ నియమనిబంధనలు, ఖర్చుల రిజిస్టర్ల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ నెల 3న నోటిఫికేషన్, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. 10వ తేదీన నామినేషన్ల స్వీకరణ ముగుస్తుందని తెలిపారు. అభ్యర్థులు తమ నామినేషన్లను10వ తేదీ సాయంత్రం 3 గంటలలోగా వేయాలన్నారు. కార్యాలయ పని దినాల్లో 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని చెప్పారు. 13వ తేదీన నామినేషన్ల స్క్రూటినీ ఉంటుందని, 15వ తేదీన నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు అని చెప్పారు. సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయంలో సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్లు స్వీకరిస్తామని, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి వేములవాడ తహసీల్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థుల సౌకర్యార్థం కేంద్రాల్లో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు తమ నామినేషన్లు హెల్ప్ డెస్క్‌లో చెక్ చేయించుకోవాలన్నారు. ఒక అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు నామినేషన్ సెట్లను దాఖలు చేసేందుకు అవకాశం ఉందన్నారు. నామినేషన్ల దాఖలుకు అభ్యర్థితోపాటు ఐదు గురికి (1 ప్లస్ 4) అనుమతి ఉంటుందన్నారు. ఫారం-6 ద్వారా సమర్పించే అఫిడవిట్‌లో అన్ని ఖాళీలు పూరించాలని చెప్పారు. నామినేషన్ సమయంలో క్రిమినల్ కేసులు, కన్విక్షన్ కేసుల వివరాలు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో మూడుసార్లు పబ్లిష్ చేయాలన్నారు. అభ్యర్థులు కొత్త ఖాతా తెరిచి దానినుంచే చెల్లింపులు చేయాలని తెలిపారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ... నామినేషన్ కేంద్రం నుంచి 100 మీటర్ల దూరం వరకు బారికేడ్లు ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల దూరం నుంచి కేవలం 3 వాహనాలను అనుమతిస్తామని చెప్పారు. ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేందుకు రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులు సహకారం అందించాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, పోలీసు అధికారులు ఉన్నారు.

## కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 1: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల, వేములవాడ నియోజవర్గాల ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలను బుధవారం కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. ఎస్పీ అఖిల్ మహాజన్, అధికారులతో కలిసి తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలోని బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. సిరిసిల్ల, వేములవాడ ఎన్నికల కౌంటింగ్ బద్దెనపల్లి గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ నిర్వహణ, లెక్కింపు సమయంలో తీసుకోవాల్సిన భద్రత తదితర అంశాలను పోలీస్ అధికారులకు సూచించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సీఐ సదన్‌కుమార్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, అధికారులు ఉన్నారు.

## నెత్తుటి రాజకీయాలను సహించేది లేదు

కోనరావుపేట, నవంబర్ 1: నెత్తుటి రాజకీయాలను సహించేది లేదని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. కోనరావుపేటలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య ఆధ్వర్యంలో దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై చేసిన దాడిని ఖండిస్తూ డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు రాష్ట్రంలో రాయలసీమ పాలన తేవాలని చూస్తున్నారని విమర్శించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో నిలుదొక్కుకోలేక అహింసా మార్గంలో దాడులు నిర్వహించడం సరికాదన్నారు. ఇలాంటి దాడులకు మళ్లీ పాల్పడితే గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులను తిరుగనివ్వమని హెచ్చరించారు. ఇక్కడ ఎంపీపీ చంద్రయ్యగౌడ్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ నర్సయ్య, సింగిల్ విండో చైర్మన్ రామ్మోహన్‌రావు, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు అబ్బసాని శంకర్‌గౌడ్, సీనియర్ నాయకుడు న్యాలకొండ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

## దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

బోయినపల్లి, నవంబర్ 1: దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థిపై కత్తితో దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బోయినపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు బుధవారం తహసీల్దార్ పుష్పలతకు వినతి పత్రం సమర్పించారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల్లో గెలవడం చేతగాక దుబ్బాకలో బీఆర్ఎస్ అభ్యర్థిపై దాడి చేశారని వినతి పత్రంలో తెలిపారు. మరో వైపు బీజేపీ నాయకులు కూడా అదనుచూసి బీఆర్ఎస్‌ను ఓడించేందుకు కాచుకుని కూర్చున్నారని తెలిపారు. ఇక్కడ ఎంపీపీ వేణుగోపాల్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, రైతు బంధు సమితి మండల కన్వీనర్ కొనుకటి లచ్చిరెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, ఏఎంసీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ కొనుకటి నాగయ్య, దేశాయిపల్లి సర్పంచ్ ఒంటెల గోపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు జూలపల్లి అంజన్‌రావు, నిమ్మ శ్రీనివాసరెడ్డి, సంబ లక్ష్మీరాజం, జంపుక ఆనంద్, ఐరెడ్డి మల్లారెడ్డి, హైమద్ హుస్సేన్ ఉన్నారు.

## గ్రామాల్లో పోలీసుల కవాతు

వేములవాడ రూరల్, నవంబర్ 1 : అనుపురం, రుద్రవరం, సంకెపల్లి గ్రామాల్లో ఎన్నికల నేపథ్యంలో పోలీసులు కవాతు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ ప్రశాంతంగా జరుగడానికి పోలీసుల కవాతు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వేములవాడ పట్టణ సీఐ కరుణాకర్, కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.